మది ఉప్పొంగేలా.. దేశభక్తి మిన్నంటేలా..



నిడదవోలు కూడలిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అధికారులు, విద్యార్థులు

- ఊరూరా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు
- పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు
- నిడదవోలులో 50 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ
- స్వాతంత్య్ర వేడుకలకు సిద్ధమైన కొవ్వూరు డివిజన్


కొవ్వూరులో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


తాళ్లపూడి మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


దేవరపల్లిలో హర్ ఘర్ తిరంగా ప్రదర్శన చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

నిడదవోలు: జాతి మొత్తం ఆనందంతో ఉప్పొంగిపోయే పండుగ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రంగం సిద్ధమైంది. ప్రతి భారతీయుడిలో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా దాదాపు ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకం రెపరెపలాడుతోంది. నిడదవోలు పట్టణంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ స్ఫూర్తివంతంగా నిర్వహించారు. ఈ ర్యాలీని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. స్థానిక గణపతి జంక్షన్ నుంచి పాటి మీద సెంటర్ వరకూ, అక్కడి నుంచి తిరిగి గణపతి జంక్షన్ వరకూ కోలాహలంగా ఈ ర్యాలీ సాగింది. మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు, మెప్మా సీఆర్పీలు, టీచర్లు ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు ఈ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 50 మీటర్ల జాతీయ జెండాను విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది ర్యాలీలో ప్రదర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డి, కౌన్సిలర్ పువ్వుల రతీదేవి, మున్సిపల్ ఏఈ సామవేదం హేమంత్, మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పట్టణ పారిశుధ్య విభాగం పర్యవేక్షకుడు సీహెచ్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించేందుకే..

కొవ్వూరు: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి పౌరుడిలో దేశభక్తిని ఇనుమడింప జేసేందుకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం పట్టణంలోని మెరకవీధి వాటర్ ట్యాంకు జంక్షన్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ హర్‌ఘర్ తిరంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురు జాతీయ జెండాలు చేత పట్టుకుని పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. భారీ జాతీయ జెండా పట్టుకుని 'భారత్‌మాతాకీ జై' అంటూ విద్యార్థులు నినాదాలతో హోరెత్తించారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ కె.డాని యేల్ జోసెఫ్, ఎంపీడీవో కె.సుశీల, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ , వివిధ పాఠశాలల విద్యార్థులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

తపాలశాఖ ఆధ్వర్యంలో ..

హర్‌ఘర్ తిరంగాలో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చేతుల మీదుగా కొవ్వూరు పట్టణంలో జాతీయ జెండాను ప్రదర్శించారు. గోదావరి మాత జంక్షన్ వద్ద ఎంపీ పురందేశ్వరి బుధవారం జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈనెల 15వ తేదీ వరకూ ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురవేయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, పోస్ట్‌మాస్టర్ జగన్‌మోహన్‌రావు, బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, జనసేన నాయకుడు మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరపల్లిలో భారీ ప్రదర్శన

దేవరపల్లి: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం దేవరపల్లిలో భారీ ఎత్తున హర్ ఘర్ తిరంగా ప్రదర్శన జరిగింది. మండల పరిషత్, మండల రెవెన్యూ, విద్యాశాఖల అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలతో ప్రదర్శన చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ఈ ప్రదర్శన సాగింది. 'వందేమాతరం', 'భారతీయ సమైక్యత వర్ధిల్లాలి', 'జై కిసాన్.. జై జవాన్', 'ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాలి' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, ఎంఈవోలు ఎం.తిరుమలదాస్, కెఆర్ఎస్‌వీ అప్పారావు, ఆర్ఐ డి.వెంకటేష్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాదే సుబ్బారావు, పీఈటీ ఓరుగంటి నాగరాజు, వీఆర్వోలు, సిబ్బంది, జెడ్పీ హైస్కూలు, భాష్యం స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండల ప్రజలందరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, దేశం పట్ల తమ భక్తిని, ఐక్యతను చాటాలని తహసీల్దార్ రవీంద్రనాథ్, ఎంపీడీవో టి.వెంకటరమణ కోరారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో బుధవారం జాతీయ జెండాలు చేతబట్టి హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. తాళ్లపూడిలో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఏఎస్‌వో జె వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.అలాగే తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. నాయకులు, అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. పదిహేను మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి సచివాలయ సిబ్బంది ర్యాలీ జరిపారు. పోచవరం, రాగోలపల్లి గ్రామాల్లోనూ హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

అవయవదానం అపూర్వం

ప్రసాద్‌ను కొనియాడిన డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు

నల్లజర్ల: మనం చనిపోయాక కూడా మరికొందరికి జీవితాన్ని ప్రసాదించడం అపూర్వ కార్యక్రమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీలో పర్యవేక్షకుడిగా పని చేస్తున్న జీవీవీ ప్రసాద్ మరణానంతరం అవయవ దానానికి సంసిద్ధత వ్యక్తం చేసిన విషయం తెలుసుకున్న డీఎంహెచ్ఓ బుధవారం ఆయనను డీఎంహెచ్ఓ రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. అవయవదాన అంగీకార పత్రాన్ని ప్రసాద్‌కు ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ అందజేశారు. అవయవ దానాన్ని మరింతగా ప్రోత్సహించేలా ప్రభుత్వం సైతం అవయవదాతలకు గుర్తింపు, గౌరవం దక్కేలా పలు కార్యక్రమాలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.


అవయవదాన పత్రాన్ని దాత ప్రసాద్‌కు అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

విద్యార్థుల లక్ష్యం చదువు మాత్రమే

తాళ్లపూడి: యువత చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని, సమాజాన్ని పక్కదోవ పట్టిస్తున్న మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొవ్వూరు ఐసీడీఎస్ సీడీపీవో జి. మమ్మి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా మంచిగా చదివి నిలబెట్టాలని సీడీపీవో ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీ, కళాశాల ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్, అధ్యాపకులు, అంగన్‌వాడీ సెక్టార్ సూపర్ వైజర్ భాగ్యకుమారి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

విద్యార్థులకు కంచాలు, స్నాక్స్ బాక్సులు

ఉండ్రాజవరం: మోర్త నంబర్-2 ప్రాథమిక పాఠశాలకు దాతలు కంచాలు, స్నాక్స్ బాక్సులు సమకూర్చారు. వాటిని హెచ్ఎం ఎస్ఎల్‌వీ ప్రసాదరావు విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఉండ్రాజవరానికి చెందిన పచ్చిపులుసు చిన సత్యం రూ.3 వేల విలువైన కంచాలు, మరో దాత రూ.1,800 విలువైన స్నాక్స్ బాక్సులు సమకూర్చారు. మోర్త సిద్ధి వినాయక యూత్ తరపున చప్పిడి హనుమంతరావు గోడ గడియారం, దాసరి సుబ్రహ్మణ్యం మరో గోడ గడియారం స్కూల్‌కు అందజేశారు. దాతలను ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మైనం భవాని, మహిళా సమాఖ్య సభ్యురాలు భాగ్యలక్ష్మి అభినందించారు.


విద్యార్థులకు స్నాక్స్‌బాక్స్‌లు అందజేస్తున్న హెచ్‌ఎం ప్రసాదరావు